# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 26, జనవరి 2026






## దేశ పౌరులకు రాజ్యాంగం అందించిన శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు

● సబ్ కలెక్టర్ మనోజ్

**నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త**

దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొంది ఎన్నికల సమయంలో ఖచ్చితంగా వినియోగించుకోవాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన 16వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ప్రోగ్రాం అధికారి ప్రసాద్‌లతో కలిసి పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వీడియో ద్వారా భారత ఎన్నికల సంఘం కమీషనర్ జ్ఞానేష్ కుమార్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 1950 జనవరి 25వ తేదీన ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం స్థాపించబడిందని, ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని అన్నారు. మనదేశంలో వేలు మీద పడే సిరా చుక్క ద్వారా మాత్రమే ప్రభుత్వాలు మారతాయని,18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఓటు నమోదు చేసుకొని వినియోగించుకోవాలని, ఓటు హక్కు పొందిన ప్రతి మిగతా 2లో..




## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు సామాన్యుడి ఆయుధం

✪ ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్,జనవరి 25, ప్రభాతవార్త**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు సామాన్యుడి శక్తివంతమైన ఆయుధమని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. ఆదివారం 11వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసిల్దార్ ప్రవీణ్, సి.ఐ. ప్రసాద్ లతో కలిసి కొమురం భీం కాంప్లెక్స్ నుండి పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మిగతా 2లో..

## పక్షుల పర్యాటక కేంద్రంగా బొక్కివాగు

కెమెరాల ద్వారా పక్షుల వీక్షణ, వెట్ ల్యాండ్స్‌కు ప్రాధాన్యత

పెంచికల్‌పేట్ అటవీ ప్రాంతంలో కలెక్టర్ హరిత పర్యటన

బేస్ క్యాంప్ పరిశీలన



**పెంచికల్‌పేట్, జనవరి 25, ప్రభాతవార్త**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం జిల్లా కలెక్టర్ హరిత పచ్చని ప్రకృతి అందాలను, విరివిగా విహారిస్తున్న పక్షులు, అడవుల్లో సంచారిస్తున్న జంతువులను పరిశీలిస్తూ పర్యటించారు. సహజ జీవ వైవిధ్యం, సహజ వనరులను, అటవీ సంపదను పరిరక్షించాలని ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. బొక్కివాగు ప్రాజెక్టులో కెమెరాల ద్వారా పక్షులను పరిశీలించి వెట్ ల్యాండ్స్ కి ప్రాధాన్యత కల్పిస్తామని ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు.మండలంలోని ఎల్లూర్ గ్రామంలో గల వెట్ ల్యాండ్ ప్రాంతమైన బొక్కివాగు ప్రాజెక్టు స్ట్రీమ్ బర్డ్స్, వలస పక్షుల కిలకిలతో పర్యావరణ సౌదర్యానికి నిలయంగా మారుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హరిత ఆదివారం బొక్కివాగు ప్రాజెక్టును సందర్శించి, నీటితోంభంలో సంచారిస్తున్న వివిధ రకాల పక్షులను కెమెరాలతో క్షుణ్ణంగా పరిశీలించారు. అఫీసియల్ బర్డ్ అబ్జర్వేషన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్ కెమెరాల సహాయంతో స్థానికంగా నివసించే పక్షులతో పాటు వలస పక్షుల సంఖ్యను గుర్తించారు. వెట్ ల్యాండ్స్, స్ట్రీమ్ బర్డ్స్‌కు అనుకూలమైన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం గుండేపల్లి బేస్ క్యాంప్ ను సందర్శించిన కలెక్టర్ కు పారెస్ట్ అధికారులు పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాలు, నివాసముండే జంతువులు, పక్షుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్శనలో భాగంగా ఎల్లూర్ సర్పంచ్ చప్పిడి రవీందర్ మిగతా 2లో..

## పోలీసులకు పరేడ్ క్రమశిక్షణ ముఖ్యం: ఎస్పీ

**ఆసిఫాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:**

పోలీసులు పరేడ్ నిర్వహిస్తున్న సందర్భంలో క్రమశిక్షణతో పాటు సమన్వయం, సమయపాలన అత్యంత ముఖ్యమైనవని జిల్లా ఎస్పీ నితిక పంత్ సూచించారు. గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్లో పోలీసుల పరేడ్ ప్రాక్టీసును పరిశీలించారు. పరేడ్ కమాండర్లతో పాటు ప్రాక్టీసు చేస్తున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిస్తూ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు మిగతా 2లో..



### నస్పూర్‌లో ఘోరం..

## రోకలితో కొట్టి కొడుకును హతమార్చిన తల్లి



✶ మద్యం మత్తులో వేధిస్తుండటంతో ఆవేశంతో అఘాయిత్యం

**నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త**

మద్యం మత్తులో నిత్యం వేధిస్తున్న కొడుకును కన్నతల్లే రోకలితో కొట్టి హతమార్చిన ఘటన శనివారం రాత్రి నస్పూర్ మండలం ప్రశాంత్ నగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వేధింపులే ఈ హత్యకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ నగర్‌కు చెందిన బోయిని శ్రీనివాసు (37) కూలి పని చేస్తూ తల్లి శంకరమ్మ, మానసిక వికలాంగురాలైన సోదరి భాగ్యతో కలిసి నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాసు ప్రతిరోజూ ఇంటికి వచ్చి తల్లిని, సోదరిని భౌతికంగా హింసిస్తూ, అసభ్య పదజాలంతో దూషించేవాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో మళ్లీ గొడవకు దిగడంతో సహనం కోల్పోయిన తల్లి శంకరమ్మ, ఇంట్లో ఉన్న రోకలి దుడ్డుతో శ్రీనివాసు తలపై బలంగా బాదింది. తీవ్ర రక్తస్రావం మిగతా 2లో..

## దేశ పౌరులకు రాజ్యాంగం అందించిన శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కరు తమ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఒక్క ఓటుతో గెలుపు, ఓటములు స్థానాలు మారుతాయని తెలిపారు. యువ ఓటర్లు తమ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో అర్హత గల వారు స్వచ్ఛందంగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా, నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖగనా భారతదేశంనా ఓటు" అనే నినాదంతో అధికారులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్, యంగ్ ఓటర్స్, దివ్యాంగ ఓటర్లు, ఓటు హక్కు నమోదు చేయడానికి కృషి చేసిన ఉత్తమ బూత్ స్థాయి అధికారులు, స్వీప్ నోడల్ ఆఫీసర్, ఓటు హక్కు వినియోగంపై ప్రచారం చేసిన కళాజాత బృందాన్ని, లక్షెట్టిపేట, హాజీపూర్ తహసిల్దార్లను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు, ధ్రువపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు సామాన్యుడి ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు సామాన్యుడి ఆయుధమని, ఓటు హక్కు సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఎన్నుకొని, అభివృద్ధి సాధించవద్దని తెలిపారు. ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ ఎన్నికలలో వినియోగించుకోవాలని, అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. నగదు, మద్యం, కానుకలు వంటి ఎలాంటి ప్రలోభాలకు లొంగిపోకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో వినియోగించుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకుని పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పక్షుల పర్యాటక కేంద్రంగా బొక్కెవాగు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బొక్కెవాగు ప్రాజెక్టు ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పోర్రు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, కట్టపై సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులతో పాటు తహసీల్దార్ తిరుపతి రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్‌లో ఘోరం.. రోకలితో కొట్టి కొడుకును హతమార్చిన తల్లి

(మొదటిపేజీ తరువాయి)

కావడంతో శ్రీనివాసు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అక్క ముప్పు వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## పోలీసులకు పరేడ్ క్రమశిక్షణ ముఖ్యం: ఎస్పీ

(మొదటిపేజీ తరువాయి)

గణతంత్ర దినోత్సవం దేశానికి గర్వకారణమైన రోజు కావడంతో పరేడ్లో పోలీసు శాఖ ప్రతిష్ట స్పష్టంగా కనిపించేలా ఉండాలన్నారు. అదే విధంగా యూనిఫాం శుభ్రత, అడుగుల సమతుల్యాత, కమాండ్లపై ఏకాగ్రతతో స్పందించడం వంటి అంశాలపై ప్రత్యేక ద్రుష్టి పెట్టాలన్నారు. ఈ ఘనతంత్ర దినోత్సవ వేడుకల్లో 4 ప్లాటున్స్ పరేడ్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




**చింతలమానేపల్లి, జనవరి 25, ప్రభాతవార్త:**

జాతీయ 16వ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలమానేపల్లి మండల కేంద్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిబా బాలికల విద్యాలయం నుంచి చత్రపతి శివాజీ చౌరస్తా వరకు ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రతి ఓటు దేశ భవిష్యత్తు, ఓటు హక్కు మన హక్కు మన బాధ్యత వంటి నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని తెలిపారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా నిలవాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ద్వారానే ప్రజలు పాలనను నిర్ణయిస్తారని, అందువల్ల ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ ఓటర్లను గుర్తించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఓటు వినియోగంపై నిరంతరం అవగాహన కల్పిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఓటర్లను అధికారులు అభినందించారు. ఈ సన్మానం ఇతరులకు స్ఫూర్తినిస్తుందని తాసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఓటు హక్కుపట్ల చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. భవిష్యత్ తరాలు ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా తీర్చిదిద్దడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటేష్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంఈఓ జయరాజ్, ఆర్ఐ జాఫర్ అహ్మద్, సర్పంచ్ మేకల పోషక్క, ఉపసర్పంచ్ తోంబ్రే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేకల ప్రసాద్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడి ఓటు దేశ భవిష్యత్ నిర్ణయించే ఆయుధం: ఎం.ఆర్.ఓ వనజారెడ్డి

**జైపూర్, జనవరి 25, ప్రభాతవార్త**



ప్రతి పౌరుడి ఓటు భారత దేశ భవిష్యత్ ను నిర్ణయించే ఆయుధమని తహశీల్దార్ వనజా రెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నా భారతదేశం నా ఓటు, మై ఇండియా మై ఓట్ అని జైపూర్ మండల కేంద్ర పురవీధుల్లో నినదాలు చేసి మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ మండల తహశీల్దార్ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదిగా, విలువైనదిగా భావించబడుతుందని తెలిపారు. ప్రతి పౌరుడి ఓటే దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రజల చేతుల్లో ఉన్న ఈ శక్తిని సద్వినియోగం చేసుకోవడమే నిజమైన ప్రజాస్వామ్య లక్ష్యమని వివరించారు. ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించడం, ప్రజలందరూ ఎన్నికల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మనందరికీ ఒక గుర్తు చూపుగా నిలుస్తుందని ఓటు హక్కు ఒక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. మన ఓటు ద్వారా మన గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశానికి సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం మనకు లభిస్తుందని, కాబట్టి ఓటు వేయకపోవడం కాదు తప్పనిసరిగా ఓటు వేయడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించాలని అన్నారు. యువత ముందుకు వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకుని, స్వచ్ఛమైన, నిష్పక్షపాత ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛగా, భయంలేకుండా, ఎటువంటి ప్రభావాలకు లోనుకాకుండా మన ఓటును వినియోగించడమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటు వేయడం ద్వారా మన హక్కులను మాత్రమే కాదు మన భవిష్యత్తును కూడా మనమే రాస్తున్నామన్న భావన కలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ బి. శ్రీనివాస్, ఎం.పి.ఓ శ్రీపతి బాపురావ్, నాయబ్ తహసీల్దార్ సంతోష్, మండల గిర్దావర్లు డి.తిరుపతి, పీ. అపర్ణ, జి.పీ.ఓ.లు ఉషారాణి, నవీన్ రాజ్, ప్రవీణ్, భారతి, శ్రీదేవి, రాజ్ కుమార్, చంద్రమోళి, శ్రీనివాస్ , ఉత్తమ బి.ఎల్.ఓ.లు అయిన ఎం. విజయలక్ష్మి, డి. శిరీష, సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ బీఎల్ఓలకు ప్రశంసా పత్రాల అందజేత

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 25, ప్రభాతవార్త :**

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓలు) ఆదివారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన బిఎల్ఓ నిక్కురే వందన ఉత్తమ సేవలకుగాను ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఓటరు నమోదు, సవరణలు, ఓటర్ల అవగాహన కార్యక్రమాల్లో నిక్కురే వందన చేసిన కృషిని గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో బిఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని, వారి నిబద్ధతతోనే స్వచ్ఛమైన ఎన్నికల ప్రక్రియ సాధ్యమవుతుందని అన్నారు.



నిక్కురె వందనకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

# రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## - ఫిబ్రవరి 2న రైల్వే కార్మికుల కోర్కెల దినాన్ని విజయవంతం చేయండి

బెల్లంపల్లి, జనవరి 25, ప్రభాతవార్త

రైల్వే కార్మికుల సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే మద్దూర్ యూనియన్ ఫిబ్రవరి 2న నిర్వహించే కోరికల దినాన్ని విజయవంతం చేయాలని దక్షిణ రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ ఛైర్మెన్ ఎస్ నాగరాజు, సెక్రెటరీ జీ. సాంబాశివుడు పిలుపునిచ్చారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని ఆర్‌వోహెచ్ డిపో షెడ్‌లో డిమాండ్స్ డే వాల్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. 8వ వేతన సంఘం సిఫార్సులను 2026 జనవరి 1 నుండి ఉద్యోగులందరికి అమలు పర్చాలని వారు కోరారు. ఉద్యోగులకు, పింఛను దారులకు, సేఫ్టీ కేటగిరీలలో పనిచేస్తున్న సిబ్బందికి రిస్క్, హార్టప్ అలవెన్సును చెల్లించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రాక్ మెయింటెనర్లకు రిస్క్ అలవెన్సును పెంచాలి. ట్రాక్ మెయింటెనర్ల గ్రేడ్ పేలు రూ. 2400, రూ. 2800లను విలీనం చేస్తూ అందరు ట్రాక్ మెయింటెనర్లకు రూ. 4200 గ్రేడ్ పే ను మంజూరు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డైరెక్టు రిక్రూట్మెంట్ కోటాలోని 10 శాతం పోస్టులను ఎల్ డీ సీ ఈ కి కేటాయించి ఎల్ డీ ఈ సీ ఈ లో అందరికి అవకాశం కల్పించాలని. పాయింట్స్ మెన్ కేటగిరీకి నాలుగు గ్రేడ్ పేల వేతన స్ట్రక్చర్ను మంజూరు చేయాలని దక్షిణ మధ్య రైల్వే లోని అన్ని డిపార్టు మెంట్లలో టెక్నీషియన్ గ్రేడ్ ఐ, గ్రేడ్2 పోస్టులను విలీనం చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ట్రాక్ మెయింటెనర్లుగా, లోకో పైలట్లుగా, ట్రైన్ మేనేజర్లు తదితర కేటగిరీలలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి కేటగిరీల వారీగా డిపార్టుమెంట్లలో మార్పుకై ఒక్కసారి ప్రాతిపదికపై అవకాశం కల్పించాలని, కరువు భత్యం 2024 జనవరి 1 నుండి 50 శాతానికి చేరటం



ద్వారా లోకో పైలట్లకు కిలోమీటరేజి అలవెన్సును పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా 70శాతం రన్నింగ్ అలవెన్సును ఆదాయపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలని, అన్ని కేటగిరీల కేడర్ పునర్వ్యవస్థీకరణకు సత్వరమే తుది రూపం ఇవ్వాలని, పెరిగిన సర్వీసులు, క్రొత్త లైన్ల ఏర్పాటుకు అనుగుణంగా అదనపు పోస్టులను కల్పించాలని, పెట్రోలింగ్ డ్యూటీకి ఇద్దరు పెట్రోల్ మెన్లను వినియోగించాలి. వారి బీట్ లెంత్‌ను తగ్గించాలని, కీ మెన్లకు పని భారం తగ్గించాలని వారు కేంద్రప్రభుత్వాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో సిఎండబ్ల్యూ షడ్ సిక్షెన్ షెడ్ లోకో లాబీ ఆఫీస్ బేరర్స్, సిఎండబ్ల్యూ లోకో పైలెట్లు పాల్గొన్నారు.




## దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఓటు హక్కుకు ఉంది

జన్నారం, జనవరి 25, ప్రభాతవార్త

దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఓటు హక్కుకు ఉంది అని జన్నారం ఇన్చార్జి ఎమ్మార్వో రామ్మోహన్ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జన్నారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఓటు హక్కు వినియోగం అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జనవరి 25న జరుపుకునే ఈ దినోత్సవం ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తుందని అన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉంటుందని, ముఖ్యంగా యువకులు మహిళలకు ఈ ఓటు హక్కుకు ఎంత ప్రాముఖ్యత ఉందో తెలియపరచడానికే ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో ఓటు హక్కుని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు.



## కలెక్టర్ చేతుల మీదుగా మెమోంటో అందుకున్న కిష్టాపూర్ పాఠశాల విద్యార్థినులు

జన్నారం, జనవరి 25, ప్రభాతవార్త

ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయి కళోత్సవం కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ 10వ తరగతి విద్యార్థినిలు ఎస్. అరవింద రాణి, కె. వర్షిత, గైడ్ టీచర్స్ దాముక కమలాకర్, బానోత్ ప్రకాష్‌లను మంచిర్యాల్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా వెల్ఫేర్ అధికారి రాఫ్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, విద్యార్థులను మెమొంటోలతో అభినందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ మంగ, ఉపాధ్యాయులు జాడి మురళి, ఎ. గోవర్ధన్ చారి, కె. రాజన్న, ఆర్. బుచ్చిలింగం, నగేష్, మణెమ్మ, జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, కాంతయ్య, శ్రీనివాస్, వాసు, రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న తదితరులు అభినందించారు.

## ఆర్.ఎం.పి., పి.ఎం.పి. కార్యాలయంలో దొంగతనం

### - మందమర్రి పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తుల ఆగడాలు

మందమర్రి, జనవరి 25, ప్రభాతవార్త



మందమర్రి పట్టణంలోని స్థానిక ఆర్.ఎం.పి., పి.ఎం.పి. కార్యాలయంలో ఆదివారం రోజున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కార్యాలయ తలుపులను పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు అక్కడున్న విలువైన వస్తువులను దొంగిలించినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక ఆర్.ఎం.పి., పి.ఎం.పి. అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్ స్పందిస్తూ, ప్రజలకు నిత్యం సేవలందిస్తూ అందుబాటులో ఉండే తమ కార్యాలయంలో ఇలాంటి ఘటన జరగడం అత్యంత బాధాకరమని తెలిపారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు బ్యాటరీ స్పీకర్ సెట్, క్రికెట్ కిట్, షటిల్ బ్యాట్స్‌లను దొంగిలించినట్లు చెప్పారు. పెడిస్టల్ ఫ్యాన్‌ను మాత్రం కార్యాలయ ఆవరణలో వదిలి వెళ్లినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 14వ వార్డ్ కౌన్సిలర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

### - వార్డు యువ నాయకులు... మన్నె సుగుణాకర్

లక్షెట్టిపేట, జనవరి 25, ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చింత అశోక్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావుకి బహుమతిగా ఇస్తామని వార్డు యువ నాయకులు సుగుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మృదు స్వభావి, సౌమ్యుడు, ఎలాంటి సమస్య ఎదురైనా తక్షణ స్పందించి పరిష్కరించి నాయకునికి వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించిన ప్రేమ్ సాగర్ రావుకి ధన్యవాదాలు తెలిపారు.. పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా ఆదరించే నాయకుడిని కౌన్సిల్ అభ్యర్థిగా గెలిపిస్తామని కాలనీవాసులు పేర్కొన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మున్సిపాలిలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రేమానందం, దేవానందం, మాదాసు డేవిడ్, ఎడ్వర్డ్ ఫ్రాన్సిస్, మాదాసు ఆగమన్ రావు, పాస్టర్ రత్నయ్య, కమలాకర్, వార్డ్ ఇంచార్జ్ ఉత్తూరి రవీందర్, సోమయ్య, వేణు, మన్నె ఇమ్మానుయేల్, సుగుణాకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## నయీామ్ పట్టణ స్థాయి క్రికెట్ పోటీల్లో పవర్ హౌస్ వారియర్స్ విజయం

బెల్లంపల్లి, జనవరి 25, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తి చెరువు కట్ట క్రికెట్ మైదానంలో ఆదివారం నయీామ్ మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో పవర్ హౌస్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. ఉదయం 9 గంటలకు ఈ క్రీడా పోటీలను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్ బాయ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తొంగల మల్లేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నయీం క్రికెట్ క్రీడాకారునిగా అనేక పోటీల్లో గెలుపొంది బెల్లంపల్లి పట్టణ పేరు ప్రఖ్యాతలు జిల్లా నలుమూలల చాటి చెప్పారని తెలిపారు. ఆదివారం సాయంత్రం ముగిసిన ఈ పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. వండర్స్‌గా బెల్లంపల్లి బస్తిలోని 786 జట్టు నిలిచింది. ఈ పోటీలకు 5 క్రికెట్ టీంలు హాజరయ్యాయి. గెలుపొందిన క్రీడాకారులకు షీల్డ్స్, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మహమ్మద్ ఇమ్రాన్, యువ నాయకుడు మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ గౌస్, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

## గ్యాస్ పంపిణీలో మేటి: సింగరేణి సూపర్ బజార్ సిబ్బందికి ప్రశంసలు

### - బిపిసిఎల్, ఐఓసిఎల్ సంస్థల నుండి ప్రశంసా పత్రాలు

నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త

శ్రీరాంపూర్, బెల్లంపల్లి డివిజన్ల పరిధిలో గ్యాస్ పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్న సింగరేణి సూపర్ బజార్ సిబ్బందిని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అభినందించారు. వినియోగదారులకు సరైన సమయంలో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తూ సంస్థకు మంచి గుర్తింపు తెచ్చిన సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజుతో పాటు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎల్.పి.జి పంపిణీలో పారదర్శకత, అంకితభావం ప్రదర్శించినందుకు గాను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బి.పి.సి.ఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐ.ఓ.సి.ఎల్ ఇండేన్) సంస్థల నుండి ప్రశంసా పత్రాలు అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. సూపర్ బజార్ సిబ్బంది ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా వినియోగదారులకు సేవలందించాలని సూచించారు. జాతీయ స్థాయి చమురు సంస్థల నుండి గుర్తింపు పొందడం ద్వారా శ్రీరాంపూర్ ఏరియా ప్రతిష్ట పెరిగిందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ఈ బృందాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, పర్సనల్ డిజిఎం అనిల్ కుమార్, ఏఐటీయూసీ నాయకుడు ముష్కె సమ్మయ్య, సూపర్ బజార్ సిబ్బంది పాల్గొన్నారు.



# రిజర్వేషన్ల హామీపై వెనకడుగు వేసిన రేవంత్ ప్రభుత్వం

## - బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం

**నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త**

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌తో పాటు బహుజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం పిలుపునిచ్చారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జోన్ స్థాయి నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం ఒక్క బీఎస్పీతోనే సాధ్యమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చి, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దానిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని రామచంద్రం విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని, లాకప్ డెత్‌లు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసి బహుజనులను బానిసలుగా మార్చాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీలకు ప్రస్తుతం ఉన్న 27 శాతం రిజర్వేషన్లు బీఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరామ్ చేసిన అలుపెరుగని పోరాటం వల్లే లభించాయని ఆయన గుర్తు చేశారు. మండల్ కమిషన్ అమలు కోసం వేలాది మంది కార్యకర్తలు జైలుకెళ్లడానికి సిద్ధపడ్డారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన వాటా దక్కాలంటే బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో జోన్ ఇన్‌చార్జులు అడ్వకేట్ నీరడి ఈశ్వర్, గైని గంగాధర్, కాదసి రవీందర్, జిల్లా ఇన్‌చార్జులు దాగం శ్రీనివాస్, నాగుల కిరణ్ బాబు, జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్ర ప్రసాద్, బొల్లంపెల్లి సంపత్ కుమార్, దుర్గం తుకారాం, సింగాడే పాండు, లక్ష్మి, అడ్వకేట్ జగన్ మోహన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం



## సీనియర్ క్రీడాకారుల క్రికెట్ పోటీలు ప్రారంభం

**తాండూర్, జనవరి 25, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని మాదారం పోలీస్ స్టేషన్ క్రీడ మైదానంలో ఆదివారం సీనియర్ క్రీడాకారులు క్రికెట్ పోటీలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలానికి సీనియర్ క్రీడాకారులు క్రికెట్ పాల్గొన్నారు. మధ్యాహ్నం రెండు జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నిర్వాహకులు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా క్రికెట్ పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. సోమవారం రెండు జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ జెడ్ పి టి సి లు బానయ్య, బండి పోషం, నాయకులు సంతోష్, చిన్నయ్య, శివ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి ఓటు పునాది

### - తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్నా

**తాండూర్, జనవరి 25, ప్రభాతవార్త :**

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది, ఆయుధంలాంటిదని తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసిల్దార్ జ్యోత్స్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం నుంచి ఐబి జాతీయ రహదారి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఐబీలో అధికారులు, విద్యార్థులు, ఓటర్లు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు ఎంతో కీలకమని, అలాంటి ఓటును బాధ్యతయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్లు ఎజాజుద్దీన్, పద్మజ, ఎంఈఓ దుర్గం శ్రీనివాస్, తాండూర్ ఏఎస్ఐ ఉస్మాన్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఓటర్ దినోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న తహసిల్దార్ జ్యోత్స్న



## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:**

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈ నెల 26 న ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చేపట్టిన గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల నిర్వహణ కొరకు ఆయా శాఖలకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, జిల్లాలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో సంబంధిత శాఖల అధికారులు స్టాల్ లు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు మైదానం సిద్ధం చేయాలని తెలిపారు. వేడుకలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



**తాండూర్, జనవరి 25, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం ఐబి సమీపంలోని పాత ఆంధ్ర బ్యాంకు సమీపంలో ఆదివారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు యువకులు గాయపడ్డారు తాండూర్ ఎస్సీ కాలనీకి చెందిన నిచల్ అనే యువకుడు ఐబి నుండి ఆంధ్ర బ్యాంకు వైపు వస్తుండగా రెబ్బెన మండలం పులికుంట గ్రామానికి చెందిన సాయి, రాజేష్ అనే ఇద్దరు యువకులు పల్సర్ బైక్ మీద వెళుతుండగా ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నిచల్, సాయి లకు తీవ్ర గాయాలు కాగా, రాజేష్ కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి తాండూర్ ఏఎస్ఐ ఉస్మాన్, బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, కానిస్టేబుల్ అంజన్న చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రహదారిపై పడి ఉన్న బైకులను తొలగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు.



## గురుకుల పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవం పై అవగాహన

**లక్షెట్టిపేట, జనవరి 25, ప్రభాతవార్త**

16వ నేషనల్ ఓటర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని లక్షెట్టిపేట తహసిల్దార్ దిలీప్ కుమార్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓటర్ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను, ఓటు యొక్క విలువపై అవగాహనను విద్యార్థులకు కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్ పిల్లలు వేసినటువంటి ముగ్గులను అభినందిస్తూ, వారిని సర్టిఫికెట్లను ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలతో మానవహారం చేయించడం జరిగింది. పిల్లలందరికీ క్యాప్‌లు, ఓటు యొక్క అవగాహన కల్పించే టీషర్టులను అందివ్వడం జరిగింది. అందరితో ఓటర్స్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ప్రిన్సిపల్ రామ కళ్యాణి మాట్లాడుతూ... విద్యార్థులందరికీ ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తూ, పిల్లలు తమ యొక్క తల్లిదండ్రులకు ఈ ఓటు యొక్క ఆవశ్యకతను చెప్పాలని సందేశం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు, డిప్యూటీ తాసిల్దార్ శ్రావణి, ఆర్ఐ శ్రీలత, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.కె. 1ఏ సమ్మక్క జాతర, గాందారి ఖిల్లా జాతర ప్రదేశాలను పరిశీలించిన బెల్లంపల్లి ఏసిపి

**రామకృష్ణాపూర్, జనవరి 25, ప్రభాతవార్త**



ఈ నెల 28 నుండి 31 వరకు రామకృష్ణపూర్ ఆర్.కె 1ఏ గని సమీపంలోని పాల వాగు ఒడ్డున నిర్వహించే సమ్మక్కసారాలమ్మ జాతర, జనవరి 31, ఫిబ్రవరి 01న మందమర్రి మండలం, బొక్కల గుట్ట సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య నిర్వహించే గాందారి ఖిల్లాలో నిర్వహించే గాందారి చల్లా మైసమ్మ జాతర ఏర్పాట్లను బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్, మందమర్రి సీఐ పర్స రమేష్,పట్టణ ఎస్.ఐ శ్రీధర్‌లతో కలిసి పరిశీలించారు. ఏసిపి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు 150 మంది పోలీస్ సిబ్బంది, 50 మంది ఎస్ అండ్ పి.సి సిబ్బందితో బందోబస్త్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏ.సి.పి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో భక్తులకు భద్రత కల్పన కొరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తామని తెలిపారు.జాతర కు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భక్తుల భద్రతకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల క్యాలెండర్ ఆవిష్కరణ

**జన్నారం, జనవరి 25, ప్రభాతవార్త**

మండలంలోని ప్రాథమిక పాఠశాల, పొనకల్ 2026 క్యాలెండర్‌ను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సింహారాజు కోదండరాం, మండల విద్యాధికారి ఎన్.విజయ్ కుమార్ ఆవిష్కరించారు. వినూత్నంగా పాఠశాల కార్యక్రమాలతో పాటు, విద్యార్థుల వ్యక్తిగత ముఖ చిత్రాలతో కూడిన క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు అన్నారు. గత సంవత్సరం లాగే ఈ సారి కూడా పాఠశాల క్యాలెండరు ముద్రణకు సహకరించిన లయన్స్ క్లబ్‌కు పాఠశాల హెచ్ఎం కె. రాజేశం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోట లచ్చన్న, కార్యదర్శి ఎర్ర ప్రవీణ్ కుమార్, ట్రెజర్ కామెర ప్రేమ్ సాగర్, జెడ్‌సి కస్తూరి సతీష్ కుమార్, అంజిత్ రావు, అనుముల రాజన్న, బాపన్న, కస్తూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను ఆదుకోవాలి: కేంద్ర మంత్రికి వినతి

## - కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్

**నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త**




కొత్తగూడెం పర్యటనకు వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆదివారం జరిగిన యూనియన్ నాయకుల ముఖాముఖ సమావేశంలో కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, అప్పటి వరకు కనీస వేతనంగా 26,000 రూపాయలు చెల్లించాలని కోరారు.ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి, అన్యాయానికి గురవుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా కార్మికులకు దక్కాల్సిన హక్కులు, సౌకర్యాలను కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని వివరించారు. ఈఎస్ఐ సీలింగ్‌ను ప్రస్తుతం ఉన్న పరిమితి నుండి 30,000 రూపాయలకు పెంచాలని విన్నవించారు. దీనివల్ల సంస్థలో పనిచేస్తున్న స్కిల్డ్ వర్కర్లు, సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లకు ఈఎస్ఐ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఫ్రోజ్ ఖాన్, ఎర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కిష్టాఫర్ పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలో బీజేపీ జోరు..

**నస్పూర్, జనవరి 25, ప్రభాతవార్త**



రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఐదో డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేరెబెల్లి రఘునాథ్ సూచనలు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. రాబోయే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఓటర్ల మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు అభ్యర్థి మిట్టపల్లి మొగిలి, సీనియర్ నాయకుడు గరిగల శ్రీను, బీజేవైఎం నాయకులు మారేడుగొండ రనదీప్, బండారి సంపత్, బూత్ అధ్యక్షురాలు సంగీత, పబ్బ మధు తోపాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాడే నాయకులనే గెలిపించండి

## - ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ విజ్ఞప్తి

**బెల్లంపల్లి, జనవరి 25, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఏంసిపిఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ప్రజల కోసం కేసులు సైతం లెక్కచేయకుండా ప్రజల వెంటే ఉంటూ ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న ఎంసీపీఐయు నాయకులను గెలిపించాలని, దాదాపు 8 వార్డులలో ఎంసిపిఐయు పార్టీ పోటీలో ఉంటుందని అదేవిధంగా సెంటర్లో బిజెపి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఎలుగపెట్టింది ఏమీ లేదని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఇంటింటి మహిళకు 2500 రూపాయలు ఇస్తానని, వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు పెన్షన్లు పెంచుతామని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని దొంగ మాటలతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు ఇప్పుడు మళ్లీ మేము పోటీలో ఉంటున్నామని ప్రజలకు అండగా ఉంటామని హామీలు నెరవేరుస్తామని కల్లిబొల్లి మాటలతో గల్లి గల్లి తిరుగుతూ వంగి వంగి దండాలు పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చింది అందుకని ప్రజల మధ్యలో ఉంటూ నిత్యం ప్రజా సమస్యలకోసం పోరాడుతున్న ఎంసిపిఐయు పార్టీ నాయకులను బెల్లంపల్లి పట్టణ మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలరులుగా గెలిపించగలరని అన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



రథం వద్ద పూజలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్

# రథోత్సవాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**ఆసిఫాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:**

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడలోని శ్రీ బాలేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా ఎస్పీ నితికా పంత్ పాల్గొని రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ శ్రీ బాలేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి జిల్లా ప్రజల సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, వైద్య సదుపాయాలు, క్యూలైన్లు వంటి అన్ని అవసరమైన వసతులను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అదేవిధంగా జాతరను దృష్టిలో ఉంచుకుని ఆలయం పరిసర ప్రాంతాల్లో సరిపడ పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బాలేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్‌లోని శ్రీ పార్వతి సమేత బాలేశ్వర స్వామి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకుని, ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో గుండి సర్పంచ్ జాబరి రవీందర్, మర్సకోల సరస్వతి, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**సారంగాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బస్టాండ్ సమీప కుడాలిలో ఆదివారం తహసిల్దార్ సంధ్యారాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు ద్వారా ప్రజాస్వామ్యబద్ధమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు గమనించాలని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక ఆయుధమని, ఈ ఆయుధంతో మంచి నాయకుడిని ఎన్నుకుంటే ప్రజలకు మంచి పరిపాలన లభిస్తుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం 2011 నుంచి ప్రారంభమైందని తెలిపారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూమన్న, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# వాగ్ధారి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

## - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ - అభివృద్ధి పనులకు భూమి పూజ

**నేరడిగొండ, జనవరి 25, ప్రభాతవార్త:**



వాగ్ధారి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నెరడిగొండ మండలంలోని వాగ్ధారి గ్రామంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కమిటిహాల్ నిర్మాణానికి రూ. 5 లక్షలతో భూమి పూజ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన గుస్సాడీ దండోరా షెడ్డును ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ వాగ్ధారి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ఐక్యమత్యంతో అన్ని సాధించుకోవచ్చన్నారు. గ్రామానికి అవసరమైన సూది నుంచి షెడ్డు వరకు అన్ని అందిస్తానని అన్నారు. అర్హులైన పేదలకు కచ్చితంగా ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ విజయ్, ఉప సర్పంచ్ సోయం లక్ష్మణ్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, మోట్టే కిరణ్, అబ్దుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి





**ఆసిఫాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హత గల ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు భాగంగా2కె రన్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యతయని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే బలమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని, స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ , రెవెన్యూ డివిజనల్ అధికారి లోకేశ్వర్ రావు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత:

### తహసీల్దార్ శ్రీకాంత్

**నర్సాపూర్(జి), జనవరి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా స్థానిక కార్యాలయం వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్సై గణేష్ మాట్లాడుతూ యువత చైతన్యవంతులై ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ఉత్తమ సమాజ నిర్మాణానికి దోహదపడాలని కోరారు. "ఓటు వేయడం మన హక్కు బాధ్యత" అంటూ సాగిన ఈ ర్యాలీలో ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు దినోత్సవం సందర్భంగా అవగహన ర్యాలీ..

**పెంచికల్‌పేట్, జనవరి 25, ప్రభాతవార్త** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఎల్కపల్లి గ్రామములో ఆదివారం ఓటు హక్కుపై అవగహన ర్యాలీ నిర్వహించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థినిలు, గ్రామస్తులు పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతపై నినాదలు చేశారు. అనంతరం సీనియర్ సిటీజన్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భక్తు రాంచంధర్ మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటుకు కీలక పాత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతి, డిప్యుటీ తహసీల్దార్ చిన్ను, ఆర్ఐ రాజేశ్వర్, రెవెన్యూ అధికారులు మండల నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దిలావర్‌పూర్, జనవరి 24, ప్రభాతవార్త:** ప్రజలు తమ ఓటు హక్కుతో నచ్చిన వ్యక్తిని చట్టసభలకు పంపేలా ఎన్నుకోవచ్చని ఎమ్మార్వో ఏజాజ్ హైమద్ ఖాన్ అన్నారు. ఆదివారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఎన్నికలలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం తొలి ఓటు హక్కు వచ్చిన వారికి ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్లను గౌరవించి సన్మానించారు. వీరు క్రమం తప్పకుండా ఓటు వేసి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్షర అనిల్, ఉప సర్పంచ్ సుఖేష్, ఎస్సై రవీందర్, డిటి రమేష్, ఉపాధ్యాయులు రెవెన్యూ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం..

**సిరికొండ, జనవరి 25, ప్రభాతవార్త** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ తుకారం పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో నిర్భయంగా కుల మత వర్గాలకు అతీతంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ తుకారాం మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజున పురస్కరించుకొని ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవం అని నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. 2026 సంవత్సరానికి ఓటు కంటే నిన్న ఏది లేదు నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటు విలువలను గుర్తించాలని తాసిల్దార్ తుకారాం సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్పంచ్ దత్తాత్రి, ఎస్సై పూజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మార్వో ఏజాజ్ హైమద్ ఖాన్



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసిల్దార్ తుకారాం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## గ్రామ అభివృద్ధికి సర్పంచ్ పాత్ర కీలకం

### - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జనవరి 25, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధికి సర్పంచ్ పాత్ర కీలకమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం నెరడిగొండ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ చేపట్టిన పంచాయతీ భవనానికి పూజలు చేశారు. ఉప సర్పంచ్ గులాబ్కి, వార్డు మెంబర్లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామదేవతలకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

## చల్లగా దీవించే తల్లికి... ఘనంగా చలి బోనాలు

### - దండిగా తరలి వచ్చి బోనాలు సమర్పించిన భక్తులు

**దిలావర్‌పూర్, జనవరి 24, ప్రభాతవార్త:** దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఆదివారం గ్రామదేవతలకు భక్తులు చలి బోనాలు సమర్పించారు. ఒకరోజు ముందే కొత్త కుండలో వంట చేసి పోచమ్మ మైసమ్మ పెద్దమ్మ తల్లులకు నైవేద్యంగా సమర్పిస్తారు. కానీ దిలావర్‌పూర్ గ్రామంలో ముత్యాలమ్మకు అదే రోజు కుండలో వండి పసుపు ఆకులలో నైవేద్యంగా సమర్పించడం సాంప్రదాయంగా వస్తోంది. వంటలు సమృద్ధిగా పండాలని తమ కుటుంబాలను చల్లగా చూడాలని అనారోగ్యాలు వ్యాధులు ప్రబలకుండా గ్రామం చల్లగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. వందల ఏండ్ల నుండి గ్రామదేవతలకు చలి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు పేర్కొన్నారు.

## ఓటు హక్కు కాదు, అది మన బాధ్యత

**బజార్‌హత్నూర్, జనవరి 25, ప్రభాతవార్త:** ఓటు హక్కు అనేది మన జన్మ హక్కు అని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే మండల ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఓటు హక్కు ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని చట్టసభలకు ఎన్నుకోవాలని అన్నారు. దీన్ని ఉపయోగించుకోవడం ద్వారా పౌరులు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని, ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, నిర్వహించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. రాజ్యాంగ సూత్రాలను కచ్చితంగా అమలు చేస్తూ, న్యాయాధికారాలు రాజ్యాంగబద్ధ సంస్థతోనే సాధ్యమవుతుందని అన్నారు. అలా మన దేశంలో ఏర్పాటైందే భారత ఎన్నికల కమిషన్. దీని స్థాపనకు గుర్తుగా ఏటా జనవరి 25న భారత జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ఓటుహక్కు ప్రాముఖ్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే భూమన్న, ఉపాధ్యాయులు రమేష్, బాపురావు, అంగన్వాడి టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





సర్పంచ్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

## సర్పంచ్‌ను సన్మానించిన కురుమ సంఘం నాయకులు

**సారంగాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:**

మండలం కేంద్రంలోని స్థానిక సర్పంచ్ కోనేరు భూమన్నను కురుమ సంఘ జిల్లా ఉద్యోగ అధ్యక్షుడు చిన్నయ్య ఆదివారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ మత సంఘం వారు ఈ విధంగా అనేక పదవులు పొంది ఉన్నత స్థానానికి రావాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చేతి బోరును మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

## భూలక్ష్మి కాలనీలో నీటి ఎద్దడి తీర్చిన సర్పంచ్

**సారంగాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఆదివారం భూలక్ష్మినగర్‌కాలనీ, భూలక్ష్మి టెంపుల్ సమీపంలో చేతి బోరు పాడై నీటి ఎద్దడి ఏర్పడినట్లు తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కోనేరు భూమన్న స్వయంగా అక్కడకు చేరుకుని మరమ్మత్తులు చేయించారు. దీంతో కాలనీవాసులకు నీటి సమస్య తొలగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్పంచ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, వార్డ్ సభ్యులు దొడ్డ నర్సయ్య, గ్రామ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద హనుమాన్ ఆలయంలో ఆధ్యాత్మిక శోభ..

### - వైభవంగా స్వామివారి ఊరేగింపు

**నర్సాపూర్(జి), జనవరి 25, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయంలో రథసప్తమి వేడుకలు గ్రామస్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ముఖ్య అర్చకులు నరహరి పంతులు వేద మంత్రోచ్చారణల మధ్య విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, గ్రామ ప్రముఖులు నరేందర్, రమేష్, సాయి కృష్ణ, సుంకరి మధు, కే రవి, భజన కమిటీ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలి

### - సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

**కాగజ్‌నగర్, జనవరి 25, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు నమోదును చేసుకోవాలని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. ఆదివారం కాగజ్నగర్పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసల్దార్ మధుకర్, ఎంఈవో ప్రభాకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరు నమోదు చేయించుకోవాలన్నారు. పట్టణంలోని అన్ని చౌరస్తాల్లో ఓటరు అవగాహన బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఏర్పడిన జనవరి 25న ఓటరు దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, వివిధ రకాల పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు.పట్టణంలో మొదట ఓటు వేసే ఓటర్లు ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ ఓటర్లు (వృద్ధులు)లను, బీఎల్ఓ,కొత్త ఓటర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధూకర్, ఎంఈవో ప్రభాకర్, నవోదయ ప్రిన్సిపల్ రేపాలకృష్ణ,నవోదయ విద్యాలయం విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇంచార్జి సర్పంచ్

**వేమనపల్లి, జనవరి 25, ప్రభాతవార్త**



మండలంలోని రాజారం గ్రామ (ఇంచార్జి సర్పంచ్) ఉప సర్పంచ్ ఎనగంటి మల్లీశ్వరి శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు గాదర్ల భీరయ్య, కొద్దున శంకరమ్మ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో వీరు చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఆకర్షించడంతో పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, నాయకులు కుర్రు వెంకటేశం, ఒడిల రాజన్న, గాలి మధు, తోకల రామచందర్, జాహిద్ అలీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో ఆర్.కె. 1ఏ సమ్మక్కసారక్క జాతర

**రామకృష్ణాపూర్, జనవరి 25, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా ఆర్.కె.1ఏ గని సమీపంలోని పాల వాగు ఒడ్డున సమ్మక్కసారక్క జాతర ఈ నెల 28 నుండి 31 వరకు సింగరేణి యాజమాన్యం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మోళిక వసతులు కల్పిస్తుంది. జాతరకు వచ్చే భక్తులు సమ్మక్క, సారాలమ్మ, పగిడిద్ద రాజులను దర్శించుకోడానికి ప్రత్యేక క్యూ లైన్‌లను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలు కొట్టుటకు ప్రత్యేక స్థలం,మొక్కులు చెల్లించుకున్న భక్తులు తల నీలాలు సమర్పించుకునేందుకు కళ్యాణ కట్టా ఏర్పాటు చేశారు. ప్రాథమిక అవసరాలైన త్రాగు నీరు కొరకు ట్యాంకులను, స్త్రీలకు ప్రత్యేకంగా స్నానాల గదులు,స్త్రీ లకు, పురుషులకు వేర్వేరు మరుగు దొడ్లను ఏరియా సివిల్ విభాగం ఆధ్వర్యంలోలో నిర్మిస్తున్నారు. భక్తుల ప్రయాణాలకు అనువైన రోడ్లను, ఏరియా ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైడ్ లైటింగ్, జాతర పరిసరాలతో పాటు, చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో లైటింగ్‌ను ఏరియా ఎలక్ట్రీకల్ ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మందమర్రి ఏరియా జి.ఎం రాధా కృష్ణ జాతర నిర్వహణకు కమిటీ వేసి పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు.



భక్తులు మొక్కులు చెల్లించే సమ్మక్క సారాలమ్మ గద్దెలు



ఎమ్మెల్సీ దండే విఠల్‌కు స్వాగతం పలికిన గ్రామస్థులు

## పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 25, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలం గువ్వలగూడ గ్రామంలో గ్రామ పోచమ్మ పున: ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ పున: ప్రతిష్ఠాపనకు వచ్చిన ఎమ్మెల్సీకి గ్రామస్థులు ఘన స్వాగతం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు

## ఇరవై మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**జన్నారం, జనవరి 25, ప్రభాతవార్త**

జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన ఇరవై మంది పేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ 320బి డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహరాజు కోదండరాం చేతుల మీదుగా అందజేశారు. మురిమడుగు గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఉద్భవించిదే పేద ప్రజలకు అనునిత్యం సేవ చేయడం కోసమే అని, ఇప్పటివరకు జన్నారం లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు అని అన్నారు. ఇప్పటివరకు ఉచిత కంటి వైద్య శిబిరాలను, డయాబెటిస్ పరీక్షలను నిర్వహించారని అందులో కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి మందులు కూడా ఉచితంగా అందచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పేదలకు నిత్యావసర సరుకులను అందించడానికి దాతగా వ్యవహరించిన కొమురవెల్లి లచ్చన్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో జన్నారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట లచ్చన్న, ప్రధాన కార్యదర్శి ఎర్ర ప్రవీణ్ కుమార్, కోశాధికారి ప్రేమ్ సాగర్, డిసి అనుముల రాజన్న, ఆర్‌సి అంజితరావు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



మొక్కులు చెల్లించేందుకు వస్తున్న భక్తులు



డప్పు చప్పుళ్లతో భక్తుల సందడి

**కాగజ్‌నగర్ రూరల్ ,జనవరి 25, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం నందిగుడా ప్రాంతంలో సమ్మక్క సారలమ్మ దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవార్ల గద్దెలకు ఆదివారం మొక్కులు ప్రత్యేక పూజలు చేసి చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలతో శివసత్తులతో అమ్మవార్ల మొక్కలు చెల్లించి బంగారం (బెల్లం) గద్దెపై సమర్పించారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి గద్దెల పసుపు, కుంకుమ, బెల్లం (బంగారం), పండ్లు, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో నందిగూడ సమీపంలో సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భక్తులతో సందడి నెలకొంది. ఈనెల 28,29,30,31 తేదీలలో జరిగే జాతరకు ఆయా ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అని ఏర్పాట్లు చేసినట్లు జాతర నిర్వహణ కమిటి అధ్యక్షులు తుమ్మ రమేష్ తెలిపారు.

# బీసీలకు బడ్జెట్‌లోను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**జన్నారం, జనవరి 25, ప్రభాతవార్త**



బీసీ లకు కేంద్ర బడ్జెట్ లోను మోసం చేస్తున్నారని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య అన్నారు.ఇంకా అయన మాట్లాడుతూ గత ఏడాది జూన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ బిల్లులో దేశంలోని 85 కోట్ల బీసీ కులాల వారికి కేవలం 2000 కోట్లు మాత్రమే కేటాయించారని, అదే తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రం లోని 2 కోట్ల బీసీల కొరకు 9000 కోట్లు పైగా కేటాయించారని, రెండు సంవత్సరాల క్రితం 2024 బడ్జెట్ బిల్లులోను అప్పుడు కేవలం 3000 కోట్లు మాత్రమే బిజెపి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కానీ అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 6000 కోట్లకు పైగా కేటాయించింది. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా అత్యధిక జనాభా 60 శాతం ఉన్న బీసీ కులాల వారికి దేశంలోని 85 కోట్ల జనాభాకు కేవలం 2000 లేదా మూడు వేల కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం దేశంలోని 85 కోట్ల బీసీ కులాల వారికి కేటాయిస్తున్నారంటే ఇది కేవలం బీసీ కులాల వారికి చాక్లెట్లు పంచినట్టుగా ఉందని అన్నారు.కనీసం ఇప్పటికైనా ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే బడ్జెట్లో నైనా దేశంలోనే బీసీ కులాల వారికి లక్ష కోట్ల నిధులు కేటాయించి బీసీ కులాల వారి సంక్షేమానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నర్సయ్య, జన్నారం మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

**బెల్లంపల్లి, జనవరి 25, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి నూతన కమిటీని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ (డైరెక్టర్స్) దూడ మహేష్ (సోమగూడెం) కమిటీ చైర్మన్‌గా, కోరల పుష్ప డైరెక్టర్ (తాండూర్), మంద ఉదయ్ వికాస్ డైరెక్టర్ (కన్నాల), పెద్ది రాజేందర్ డైరెక్టర్ (బెల్లంపల్లి టౌన్), చిలువేరు అరవిందు డైరెక్టర్ (అంకుశం), మీస రమేష్ డైరెక్టర్ (చిన్న బుధ), సుంకరి రాజేష్ డైరెక్టర్ అండ్ డోనర్ (రామకృష్ణాపూర్) లతో కూడిన కమిటీ సభ్యులను ఎన్నుకొని, వారికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారిక లెటర్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ కన్నాల గ్రామపంచాయతీలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని, ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం 2026 మహాశివరాత్రి పర్వదినాన్ని నూతన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం, తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టని వారిపై చర్యలు తీసుకోవాలి

**- దళిత సంఘాల నాయకులు**

**వాంకిడి, డిసెంబర్ 25. ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

గణతంత్ర దినోత్సవం వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటం పెట్టకుండా జాతీయ జెండా ఎగుర వేయడం,జెండా వందన చేసే వారి పై కఠిన చర్యలు తీసు కోవాని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత,గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు,రేగుంట కేశవ్ రామ్ మాదిగ,అంబేద్కర్ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, పలువురు దళిత నాయకులు మాట్లాడతూ.కొంతమంది ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అంబేడ్కర్ చిత్రపటం పెట్టకుండా గణతంత్ర దినోత్సవం వేడుకలు జరుపు కొంటున్న విషయం తమ దృష్టికి వచ్చినదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనూ, ప్రజా ప్రతినిధులు సైతం మాత్మ గాంధీ ఇతర నాయకుల చిత్రపటాలు పెట్టి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబాసాహెబ్ చిత్రపటాన్ని పెట్టడం లేదని వారు పేర్కొన్నారు. రెండు సంవత్సరాల 18 నెల 11 రోజులు అష్ట కష్టాలు పడి తన కుటుంబాన్ని సైతం త్యాగం చేసి భారతదేశానికి భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుని చిత్రపటం పెట్టకపోవడం భారత రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానించడమే అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ సారి బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి అవమానం జరిగితే సహించే లేదని,అలాంటి వారిపై చర్యలు తీసుకొనే వరకు నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో బంజారా యువన సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, బీఎస్పీ జిల్లా నాయకులు శ్యామ్ రావు దొండుజి దుర్గే, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ ఉప్రే,కోశాధికారి నాగ్ సేన్ ఉప్రే లు పాల్గొన్నారు.